

దుబ్బాకలో మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రౌటేల

అందరి ఆమోదం పొందిన వ్యక్తికే డీసీసీ అధ్యక్ష పదవి

- ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రౌటేల

దుబ్బాక/తొగుట అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని, కార్యకర్తల మనోభావాలకు అనుకూలంగా నిలిచే పార్టీ అని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, సిద్దిపేట జిల్లా ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రౌటేల అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కిందిస్థాయి కార్యకర్త నుంచి ప్రజా ప్రతినిధుల వరకు అందరి ఆమోదం పొందిన వ్యక్తికే సిద్దిపేట డీసీసీ అధ్యక్ష పదవిని కేటాయిస్తామని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల్లో ఉండే ప్రజా నాయకులను డీసీసీ అధ్యక్షులుగా ఎంపిక చేయడమే లక్ష్యమని తెలిపారు. మంగళవారం దుబ్బాకలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక అసెంబ్లీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సంఘటన్ శ్రీజాన్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అలాగే తొగుట మండలంలోని రాంపూర్‌లో ఏర్పాటు చేసిన జిల్లా డీసీసీ అధ్యక్ష పదవి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జిల్లా అధ్యక్ష పదవికి ఆశిస్తున్న పలువురు ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుని, వచ్చిన పేర్లకు సంబంధించి ఎవరైతే బాగుంటారనే విషయమై వివిధ కోణాల్లో పరిశీలన జరిపి, పార్టీ అధిష్టానానికి ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను ప్రాధాన్యం క్రమంలో అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అయి ఉండి, ఏ స్థాయిలో పనిచేసే వ్యక్తి అయినా డీసీసీ అధ్యక్ష పదవికి అర్హులేనన్నారు. తుది నిర్ణయం కార్యకర్తల అభిప్రాయం మేరకేనని తెలిపారు. అంతకు ముందు నాయకులు, కార్యకర్తలతో ఆమె మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల కాంగ్రెస్ బాధ్యులు చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పూజల హరికృష్ణ, నాయకులు మచ్చశ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, అమర్, అనంతుల శ్రీనివాస్, కాల్వనరేష్, కొంగరి రవి, శ్రీరాం నరేందర్‌తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పీసీసీ కో-ఆర్డినేటర్ మహమ్మద్ నజీర్, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి పాల్గొన్నారు.

బద్దిపడగ హైస్కూల్ హెచ్‌ఎం సస్పెండ్

నంగునూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సరిగా మధ్యాహ్న భోజనం అందించకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు నంగునూరు మండలం బద్దిపడగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మను కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సస్పెండ్ చేశారు. ఈ నెల 13న కలెక్టర్ నంగునూరు మండలం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో కామన్ డైట్ మెనూ ప్రకారం ఆహారం లేకపోవడం, పాఠశాలలో పరిశుభ్రతను సరిగా పాటించకపోవడంను కలెక్టర్ గమనించి హెచ్‌ఎంను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించడంతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

స్టీల్‌బ్యాంకులో సామగ్రి స్వాహా..!

- సిద్దిపేటలో ప్రతిష్ఠాత్మక పథకానికి చిల్లు
- ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చే ప్రణాళికలో లోపం
- కోటి రూపాయలతో 34 వార్డుల్లో ఏర్పాటు
- సిబ్బంది చేతివాటం.. పలు టిఫిన్ సెంటర్లకు స్టీల్ గ్లాసులు, ప్లేట్లు, బకెట్లు!
- లెక్క తేల్చాలని వార్డు ప్రజల డిమాండ్

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా, ప్లాస్టిక్ రహిత సిద్దిపేట పట్టణం కోసం ప్రారంభమైన 'స్టీల్ బ్యాంక్' పథకానికి అక్రమాల చిల్లు పడింది. పట్టణంలోని 34 వార్డుల్లో రూ. 1.02 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్ఠాత్మక పథకంలో దాదాపు 8 వేలకు పైగా స్టీల్ వస్తువులు మాయమైనట్లు వెల్లడైంది. సిబ్బంది చేతివాటం కారణంగా ఈ సామగ్రి పలు టిఫిన్ సెంటర్లు, హోటళ్లకు చేరినట్లు తెలుస్తుండగా, దీనిపై అధికారులు తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- సిద్దిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)





ఓ హోటల్‌లో 18, 19వ వార్డుకు చెందిన స్టీల్ బ్యాంకు గ్లాసు, వస్తువులు

పెళ్లిళ్లు, శుభకార్యాలు, చిన్నపాటి ఫంక్షన్లలో భోజనాల కోసం గతంలో సిద్దిపేట పట్టణంలో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లను విరివిగా ఉపయోగించేవారు. దీనివల్ల పెరుగుతున్న ప్లాస్టిక్ భూతం నుంచి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు, సిద్దిపేట పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆలోచన మేరకు విడతలవారీగా పట్టణంలోని పాత 34 మున్సిపల్ వార్డుల్లో 2020లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేశారు. ఒక్కో స్టీల్ బ్యాంక్ ఏర్పాటుకు రూ. 3లక్షల మేర నిధులు ఖర్చు చేసి, దాదాపు 14 రకాల వస్తువులను అందుబాటులో ఉంచారు. వార్డుల్లో ఏ శుభకార్యం జరిగినా కాలనీ వాసులు అతి తక్కువ అద్దెకే వీటిని వినియోగించుకునేలా, అలాగే ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో విందులకు సైతం ఈ స్టీల్ వస్తువులను ఉపయోగించేవారు. అయితే, గతేడాదికి పైగా వీటిపై అధికారుల నిఘా కొరవడటంతో దాదాపు 8 వేలకు పైగా స్టీల్ వస్తువులు మాయమైనట్లు తెలుస్తోంది.



పట్టణంలోని హోటల్‌లో ఓ వార్డుకు చెందిన స్టీల్ బ్యాంకు టిఫిన్ ప్లేటు

34 వార్డుల్లో... రూ. 1.02కోట్లతో

సిద్దిపేట మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం, బాలవికాస్ సంయుక్త ఆధ్వర్యంలో రూ. 3లక్షలతో ముందుగా స్టీల్ బ్యాంకును ఒకే ఒక్క వార్డులో ఏర్పాటు చేశారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో, మున్సిపల్ పాత 34 వార్డులకు విస్తరించాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. ఈ మేరకు రూ. 1.02కోట్ల నిధులతో పలు విడతలవారీగా పట్టణంలోని 34 వార్డులలో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేశారు. ఒక్కో స్టీల్ బ్యాంకులో భోజనం, టిఫిన్ ప్లేట్లు, గ్లాసులు, టీ గ్లాసులు, స్పూన్లు, బకెట్లు, బేషన్లు, లాడిల్స్, స్వీట్ బౌల్స్ గంటెలు, వాటర్ జగ్గులు.. ఇలా 14 రకాల స్టీల్ వస్తువులను సమకూర్చారు. ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి, స్టీల్ పాత్రలపై "స్టీల్ బ్యాంక్ సిద్దిపేట, వార్డు నంబర్" ముద్రించి, మంచి మందంతో ఉన్న వస్తువులను కొనుగోలు చేశారు. బయటి టెంట్ హౌస్‌లతో పోలిస్తే, ఇక్కడ అతి తక్కువ అద్దెకే సామగ్రి లభించేలా అందుబాటులో ఉంచారు.

8 వేలకు పైగా కనిపించని స్టీల్ సామగ్రి...

స్టీల్ బ్యాంకుల్లో ఏర్పాటు చేసిన పలు రకాల స్టీల్ సామగ్రిలో

నం.	వస్తువులు	మొత్తం సామగ్రి	ఒక్కోటి రూ.లలో
1.	భోజనం ప్లేటు	750	1.25
2.	టిఫిన్ ప్లేటు	250	1.00
3.	మంచినీళ్ల గ్లాసులు	750	0.25
4.	టీ గ్లాసులు	250	0.25
5.	టీ చెంచాలు	750	0.25
6.	స్వీట్ బౌల్స్	750	0.25
7.	బేషన్లు	16	10.00
8.	బకెట్లు	08	5.00
9.	లాడిల్స్	06	3.00
10.	డోంగాలు	06	3.00
11.	రైస్ గంటెలు	06	3.00
12.	వాటర్ జగ్గులు	06	5.00
13.	కట్లరి ట్రేలు	02	5.00
14.	స్టీల్ ట్రే	02	10.00
15.	ప్లాస్టిక్ ట్రే	14	ఉచితం

దాదాపు 8 వేల వస్తువులకు పైగా కనిపించకుండా పోయినట్లు తెలిసింది. కనిపించకుండా పోయిన వస్తువులన్నీ పలు టిఫిన్, మిల్లెట్ల సెంటర్ల నిర్వాహకుల వద్ద ఉన్నట్లు స్పష్టమైంది. వార్డు వాసుల కోసం ఏర్పాటు చేసిన ఈ స్టీల్ వస్తువులను... ఆయా వార్డు ప్రజల కుటుంబాల్లో జరిగే శుభకార్యాలకు మాత్రమే వినియోగించాల్సి ఉండగా... సిబ్బందా లేక నిర్వాహకుల చేతివాటం వలనో ఇవి టిఫిన్ సెంటర్ల వద్ద దర్శనమిస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం సిద్దిపేట పట్టణంలో అధికారికంగా నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలు, వజ్రోత్సవాలు సహా పలు కార్యక్రమాల్లో భోజనాల కోసం వార్డుల నుంచి

మిగతా 8వ పేజీలో



కూటిగల్‌లో కుటుంబసభ్యులతో కంకటి వెంకటయ్య

మూడున్నర దశాబ్దాల తర్వాత సొంతింటికి

- కూటిగల్ చేరుకున్న మాజీ మావోయిస్టు కంకటి
- ఆనందం వ్యక్తం చేస్తున్న కుటుంబసభ్యులు

మద్దూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ధూళిమిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు కంకటి వెంకటయ్య మూడున్నర దశాబ్దాల అనంతరం స్వగ్రామానికి చేరుకుని తన సొంత ఇంట్లో అడుగుపెట్టాడు. 1990లో పీపుల్స్‌వార్‌లో చేరి వివిధ హోదాలలో పనిచేసిన వెంకటయ్య ఇటీవల రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన విషయం విధితమే. కొన్నాళ్ల క్రితం పీపుల్స్‌వార్‌ను వీడి లొంగిపోయిన భార్య మంజులతో కలిసి మంగళవారం సాయంత్రం కూటిగల్‌లోని తన ఇంటికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా వెంకటయ్య సోదరీమణులు, వదిన, వారి కుమారులు ఆయనకు స్వాగతం పలికారు. భావోద్వేగానికి లోనైన వెంకటయ్య కన్నీటిపర్యంతమయ్యాడు. గ్రామస్థులు, చుట్టుపక్కలవారు వచ్చి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ... పీపుల్స్‌వార్‌లో చేరిన తాను అనారోగ్య సమస్యల కారణంగా జనజీవన స్రవంతిలో కలిశానని, కుటుంబసభ్యులతో కలిసి శేషజీవితం గడిపేందుకు స్వగ్రామానికి వచ్చినట్లు తెలిపారు.

కారు అద్దాలు పగులగొట్టి రూ. 20 లక్షలు చోరీ 7

నిరుపయోగంగా పశువుల హాస్టల్

- కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం

6

అవస్థల్లో ఐటీఐ.. అడ్వాన్స్‌డ్‌గా ఏటీసీ!

- పారిశ్రామిక శిక్షణలో ప్రభుత్వాల నిర్లక్ష్యం
- ప్రైవేటు రంగ సంస్థతోనేమో ముందంజ
- ఏడేళ్లయినా పూర్తికాని ఐటీఐ భవనం...
- రెండేళ్లలోనే విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న ఏటీసీ



రెండేళ్లలోనే పూర్తయిన ఏటీసీ భవనం

దుబ్బాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక శిక్షణలో ప్రభుత్వాల నిర్లక్ష్యానికి, ప్రైవేటు సంస్థల చొరవకు దుబ్బాకలోని రెండు శిక్షణ కేంద్రాలే నిదర్శనం. ఏడేళ్లయినా నిధుల కొరతతో ప్రభుత్వ ఐటీఐ భవనం అసంపూర్తిగా ఉంటే, దాని పక్కనే రెండేళ్లలోనే అత్యాధునిక వసతులతో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్) నిర్మాణం పూర్తయి, విద్యార్థులకు శిక్షణ అందిస్తోంది. వృత్తి విద్య నైపుణ్యం విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టమవుతుంది.

విద్యార్థులను పారిశ్రామికాభివృద్ధి రంగంలో ప్రోత్సహిస్తున్నామనే పాలకుల మాటలు ఉత్తమాటలేనని తేలిపోయింది. ప్రభుత్వాలు మారినా, పాలకుల నిర్లక్ష్యపు జాడ్యం మాత్రం వ్యవస్థల మీద వదలడం లేదు. ఏడేళ్లుగా దుబ్బాకలోని ప్రభుత్వ ఐటీఐ (పారిశ్రామిక శిక్షణా సంస్థ) నిధుల లేమితో నిర్లక్ష్యానికి గురైతే, దాని పక్కనే రెండేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించిన అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక శిక్షణ అందించేందుకు ముందుకు సాగుతోంది. ఈ రెండు కూడా విద్యార్థులలో వృత్తివిద్యా నైపుణ్యాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలే. ఈ రెండూ ప్రభుత్వ ఆధీనంలోని ఐటీఐ కళాశాల పరిధిలోనే కొనసాగుతున్నప్పటికీ, భవన నిర్మాణంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల చొరవ ఏపాటిదో దుబ్బాకలోని ఐటీఐ కళాశాల, ఏటీసీ కేంద్రాలను చూస్తే తేటతెల్లమవుతుంది. నిధుల కొరతతో ఇప్పటికీ ఐటీఐ కళాశాల సొంత భవనం నిర్మాణం పూర్తి కాక, విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

దీనావస్థలో ఐటీఐ

2012లో దుబ్బాక పట్టణంలోని ఒక అద్దె భవనంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటైంది. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను వృత్తి విద్యా శిక్షణ వైపు మళ్లించేందుకు దీనిని దుబ్బాకలో మంజూరు చేశారు. ఇందుకోసం 2018లో ఐటీఐ కళాశాలకు పక్కా భవనం నిమిత్తం పట్టణ శివారులో 4 ఎకరాల విస్తీర్ణంలో రూ5కోట్లతో భవన నిర్మాణానికి అప్పటి మాజీ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు ప్రారంభించి ఏడేళ్లు గడిచినా, నిధుల కొరతతో నేటికీ పనులు పూర్తి కాక, అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. ఇప్పటివరకు కేవలం 65 శాతం మేర రూ.2.5కోట్ల పనులు చేసిన గుత్తేదారుకు కేవలం రూ.50 లక్షలు మాత్రమే వచ్చాయి. ప్రభుత్వం మారి ఇంకా రావాల్సిన బిల్లులు పూర్తి స్థాయిలో మంజూరు కాలేదు. దీంతో కళాశాలలో గల ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ కోర్సుల్లో వృత్తి శిక్షణ పొందుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు (20 మంది చొప్పున మొత్తం 80 మంది) ఇరుకైన తరగతి గదులలో అవస్థలు పడుతున్నారు.

ఏటీసీ అడ్వాన్స్

ప్రభుత్వ వ్యవస్థలను వెక్కిరిస్తూ, ప్రైవేటు రంగ సంస్థ ముందుకు వచ్చి విద్యార్థులకు అందించే అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ (అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రం) రెండేళ్లలోనే ప్రారంభమై, విద్యార్థులను తీర్చిదిద్దే పనిలో ముందుకు సాగుతోంది. పదోతరగతి పూర్తయిన నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం, దానిలో భాగంగా ఐటీఐ కళాశాలలకు అనుబంధంగా టాటా గ్రూప్‌నకు చెందిన టీటీఎల్ (టాటా టెక్నాలజీస్ లిమిటెడ్) సహకారంతో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్)ను నిర్మించింది. రాష్ట్రంలో 65 ఏటీసీ కేంద్రాలు ఉండగా, ఇటీవల ప్రభుత్వం మరో 46 ఏటీసీ కేంద్రాలను మంజూరు చేసింది. సిద్దిపేట జిల్లాలో దుబ్బాక, కుకునూరుపల్లి, సిద్దిపేటలో నిర్మాణాలు పూర్తయిన మూడు ఏటీసీ కేంద్రాలను వేగవంతంగా పూర్తిచేసి, ప్రస్తుతం విద్యార్థులకు అందాల్సిన ఆధునాతన పారిశ్రామిక, సాంకేతిక నైపుణ్యాన్ని అందిస్తోంది. దుబ్బాక పట్టణ శివారులో ఏడేళ్ల క్రితం ప్రభుత్వం రూ.5 కోట్లతో చేపట్టిన నూతన ఐటీఐ కళాశాల అసంపూర్తి భవనాన్ని అనుకుని, టాటా కంపెనీ ఆధ్వర్యంలో రెండేళ్ల వ్యవధిలో ఏటీసీ కేంద్రం పూర్తి చేసింది. ప్రతి కేంద్రంలో మూడు ల్యాబ్‌లు, ప్రతి ల్యాబ్‌లో 12 కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటీసీ కేంద్రంలో ఉన్న ఆరు కోర్సుల్లో 72 సీట్లు ఉన్నాయి. ఏడాది నుంచి రెండేళ్ల కాలపరిమితి కలిగిన ఈ కోర్సులకు సంబంధించి అందించే శిక్షణలో బోధనతో పాటు ప్రాక్టికల్స్‌ను టీటీఎల్ నిపుణులు నేర్పిస్తారు. శిక్షణ అనంతరం వీరికి టాటా గ్రూప్, ఇతర సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ప్రైవేటు రంగ సంస్థ భాగస్వామ్యంతో వేగంగా వృత్తివిద్య కోర్సుల శిక్షణ కేంద్రాన్ని పూర్తి చేసినంతగా, ప్రభుత్వం ఏడేళ్లయినా భవనాన్ని పూర్తి చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



అసంపూర్తిగానే ఐటీఐ కళాశాల భవనం

పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడాలి

- రైతుల కృషి వల్లే కరోనా కాలంలో ఆహార భద్రత
- రసాయనిక ఎరువుల వాడకంతోనే అనారోగ్య సమస్యలు
- సేంద్రియ పద్ధతుల్లో సాగు మంచి ఆరోగ్యం: కలెక్టర్


సిద్దిపేటరూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడేలా ఉన్నాయని, విద్యార్థుల కృషి అభినందనీయమని కలెక్టర్ కె.హైమావతి అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాలలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం, బీజేఆర్ వ్యవసాయ కళాశాల (జిల్లెల్లగడ్డ, సిరిసిల్ల) విద్యార్థులు నిర్వహించిన "గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం" ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మన దేశంలో 150 కోట్లకు పైగా జనాభా ఉందని, కరోనా వంటి విపత్కర కాలంలో కూడా ఆహారం కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా సగర్వంగా నిలబడగలిగామంటే దానికి రైతుల కృషే కారణమని గుర్తు చేశారు. తాను చిన్నతనంలో వ్యవసాయం చేశానని, అన్ని పంటల సాగు ప్రక్రియ గురించి పూర్తి అవగాహన ఉందని తెలిపారు. యూరియా వంటి రసాయన ఎరువులను అధిక మోతాదులో వాడటం వల్లే మనుషులు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. రసాయనాల వాడకం వల్లే గాలి, నేల, నీరు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ముఖ్యంగా మేలిమి రకమైన సేంద్రియ (ఆర్గానిక్) పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సంతోష్ కుమార్, ఏడీఏ పద్మ, అసోసియేట్ డీన్ ఏజీ కాలేజీ సిరిసిల్ల సునీతాదేవి, వ్యవసాయ అధికారులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

మెనూ ప్రకారం భోజనం అందించాలి

సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల ప్రభుత్వ పాఠశాలను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆలుగడ్డ టమాటా కూర, పచ్చిపులుసు మాత్రమే వండారని తెలుసుకుని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూలో భాగంగా మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, సాంబారు చేయకపోవడంపై ప్రశ్నించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. పచ్చిపులుసు పెట్టడం వల్ల పిల్లలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని వంట సిబ్బందిపై మండిపడ్డారు. వంట సరుకులు, బియ్యం, కూరగాయలు కొలత పర్యవేక్షణ చేయకుండా, కామన్ డైట్ మెనూ పాటించకుండా ఇంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూ పాటించనందుకు, విద్యార్థులకు పచ్చి పులుసు పెట్టినందుకు, సరిపడినంత ఆహారం పెట్టనందుకు గాను ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఫోన్ ద్వారా ఆదేశించారు.



కొమురవెల్లి గడ్డ.. సీతాఫలాలాల అడ్డా

- కమాన్ వద్ద జోరుగా క్రయవిక్రయాలు
- ఇక్కడి నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

7

మల్లన్నవనం అద్భుత పర్యాటక కేంద్రం

- నిధులు రాగానే బోటింగ్ సదుపాయం
- రాజన్న సిరిసిల్ల జోన్ సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్

కుకునూరుపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మల్లన్న వనం అద్భుతమైన పర్యాటక కేంద్రం అవుతుందని రాజన్న సిరిసిల్ల జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) ప్రియాంక వర్గీస్ తెలిపారు. మంగళవారం కుకునూరుపల్లి మండలం లకుడారం శివారులోని మల్లన్న వనాన్ని ఆమె పరిశీలించారు. నిధులు విడుదల కాగానే దీనిని అద్భుతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. చుట్టూ అడవి, కొండలతో మధ్యలో పెద్ద చెరువు మహా అద్భుతంగా ఉందని, వీలైతే అంకిరెడ్డిపల్లి చెరువులో బోటింగ్ సదుపాయం కూడా కల్పిస్తామని చెప్పారు. రాజీవ్ రహదారి నుంచి మల్లన్నసాగర్‌కు అడవి మధ్యలో 13 కిలోమీటర్లు రోడ్డు ఉండడం, ఇక్కడి నుంచి మల్లన్నసాగర్ బ్యాక్‌వాటర్‌ను చూసే సదుపాయం ఉండడం పర్యాటకులకు కేరాఫ్ అడ్రస్‌గా మల్లన్న వనం నిలుస్తుందన్నారు. రాజీవ్ రహదారికి దగ్గరగా పక్కనే మల్లన్న సాగర్ ప్రాజెక్టు ఉండడంతో మల్లన్న వనం పర్యాటకులకు ఎంతగానో నచ్చుతుందని తెలిపారు. వాచ్ టవర్ పైకి వెళ్లి అడవిని, అంకిరెడ్డిపల్లి చెరువును పరిశీలించారు. నిధులు రాగానే మల్లన్న వనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం బీట్ ఆఫీసర్ల భవనాన్ని పరిశీలించారు. ఆమె వెంట డీఎఫ్ఓ శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఓ ఇక్రముద్దీన్, సెక్షన్ ఆఫీసర్లు రమేష్, ముజీద్ తదితరులు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపల్లి చెరువును పరిశీలిస్తున్న ప్రియాంక వర్గీస్

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

పటాన్‌చెరు/చేగుంట/నర్సాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. నర్సాపూర్ మండలం రుస్తుంపేటకు చెందిన మేస్త్రీ పని చేసే దుర్గయ్య అనే వ్యక్తి అదృశ్యమైయ్యాడు. మంగళవారం సాయంత్రం ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గయ్య అతడి భార్య సుజాత దంపతులు ఈ నెల 12వ తేదీన నర్సాపూర్‌లో పెళ్లికి హాజరై తిరిగి గ్రామానికి వెళ్లి భార్యను వదిలి బయట పని ఉందని వెళ్లాడు. అతడు ఎంతకు రాకపోవడంతో చుట్టు పక్కల వెతకడమే కాకుండా గ్రామాలలో కూడా వెతికినా ఫలితం లేదు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దుర్గయ్య(ఫైల్)

చేగుంటలో ఒకరు

మరో వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేగుంట మండల పరిధిలోని పొలంపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎరుకల ప్రవీణ్ సోమవారం రాత్రి 7 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు ప్రవీణ్ బ్లాక్ కలర్ టీ షర్ట్, నీలిరంగు జిన్ ప్యాంటు, ధరించి ఉన్నాడు. భార్య ఎరుకల కావేరి చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భార్య ఫిర్యాదు తో చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఎరుకల ప్రవీణ్ (ఫైల్)

పటాన్‌చెరులో మరొకరు

డ్యూటీకి వెళ్లిన ఓ యువతి అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హిమబిందు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీలో ఉంటున్న మధుకుమారి చందానగర్‌లో మంగళాయం అనే వస్త్ర దుకాణంలో పని చేస్తుంది. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లి ఇంటికి రాలేదు. రాత్రి సమయంలో చుట్టుపక్కల విచారణ చేశారు. ఫలితం లేకపోవడంతో మంగళవారం అక్క సోనికుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



మధుకుమారి (ఫైల్)

గంజాయి జాడ కోసం డ్రోన్‌తో జల్లెడ

నారాయణఖేడ్/కల్హేర్/సిర్గాపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి);సిర్గాపూర్ మండల పరిధిలోని గిరిజన తండాల శివారులోని కంది, పత్తి చేలల్లో గంజాయి జాడ కోసం మంగళవారం పోలీసులు డ్రోన్ కెమెరాతో జల్లెడ పట్టారు. రెండు రోజుల క్రితం నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తాండా శివారులో గంజాయి మొక్కలు పట్టుబడిన నేపథ్యంలో కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సిర్గాపూర్ మండల పరిధిలోని పటేల్, గైరాన్ గిరిజన తాండాల శివారులోని పత్తి, కంది పంటల్లో గంజాయి మొక్కల కోసం డ్రోన్‌తో జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజనులు తమ పంట పొలాల్లో గంజాయిని అంతరపంటగా సాగు చేసినట్లు తేలితే, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. ఎలాంటి ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండదని, ప్రస్తుత నూతన చట్టాల ప్రకారం కఠిన శిక్షకు బాధ్యులవుతారని సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సిర్గాపూర్ ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో

గంజాయిని సాగు చేసిన, విక్రయించిన, రవాణ చేసిన నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీవెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నారాయణఖేడ్ ప్రాంతంలోని వ్యవసాయ పొలాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి సాగు , రవాణ సమాచారాన్ని వెంటనే నారాయణఖేడ్ ఎస్ఐ శ్రీశైలం నెంబరు 8712656757, నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి 8712656733, తన నెంబరు 8712656709కు సమాచారం అందించాలన్నారు. తమకు సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



సిర్గాపూర్ మండలం పటేల్ తండా శివారులోని కంది, పత్తి పొలాల్లో డ్రోన్ గాలింపు చర్యలను పరిశీలిస్తున్న కంగ్టి సీఐ, సిర్గాపూర్ ఎస్సై



నిరుపయోగంగా పశువుల హాస్టల్

- కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం
- చోరీకి గురతున్న విలువైన సామాగ్రి
- పట్టించుకోని అధికారులు,నాయకులు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని లక్ష్యంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, సూడా మాజీ చైర్మన్ మారెడ్డిలు ఏర్పాటు చేసిన పశువుల హాస్టల్ నిరుపయోగంగా మారింది. ఎక్కడైనా మనుషులకు హాస్టల్ ఉంటుంది. కాని సిద్దిపేట రూరల్ మండలంలో పశువులకు ఈజీఎస్, సీఎస్ఆర్ లో సుమారు రూ2 కోట్ల నిధులతో హాస్టల్‌ను నిర్మాంచారు. సిద్దిపేట పట్టణానికి దగ్గరలో ఉండడంతో ఇర్కోడు గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి పశువుల హాస్టల్ నిర్మించారు. ప్రారంభించిన నుంచి నేటి వరకు వినియోగంలో లేకపోవడంతో పశువుల హాస్టల్‌లో ఉన్న విలువన సామగ్రిని గుర్తుతెలియని దుండగులు గదుల తాళాలలు పగలగొట్టి ఎత్తుకెళ్తున్నారు. పశువుల హాస్టల్‌ను అధికారులు కాని, నాయకులు కాని పట్టించుకోకపోవడంతో అద్వానంగా తయారైంది. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయిందని విమర్శలు వస్తున్నాయి.



ఇర్కోడు పశువుల హాస్టల్‌లో నిర్మించిన పశువుల షెడ్లు

అన్ని రకాల సౌకర్యాలతో నిర్మాణం..

ఇర్కోడు గ్రామంలో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.1 కోటి, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నుంచి రూ.1 కోటి నిధులతో అన్ని రకల సౌకర్యాలతో పశువుల హాస్టల్ నిర్మాంచారు. సుమారు 100 నుంచి 150 వరకు ఆవులత, గేదెలు ఉండే సామార్థ్యంతో షెడ్లు నిర్మాంచారు.

చోరీకి గురవుతున్న విలువైన సామగ్రి..

పశువుల హాస్టల్‌లో ఏర్పాటు చేసిన విలువైన సీసీ కెమారాలు, మందులు నిల్వ ఉంచే ఫ్రిజ్ వంటి సామాగ్రిని గుర్తుతెలియని దుండగులు చోరికి పాల్పడగా పాలకేంద్రం పశువల వైద్య సేవలు అందించే గదులలో మందులు, విలువైన సామగ్రి ధ్వంసం అయింది. పశువులకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లు, ఇతర వస్తువులు పాడైపోతున్నాయి. ఇప్పటికెనా అధికారులు, నాయకులు స్పందించి పశువుల హాస్టల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాణా ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జోగిపేట రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి వంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోబోయిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల మేరకు జోగిపేట పట్టణానికి చెందిన మహమ్మద్ సలీం తన భార్య విడాకులు ఇచ్చిందని ఆవేదనకులోనై మనస్తాపంతో కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఈ ఘటనలో తన కుటుంబ సభ్యులు తనపై దాడి చేసారని ఆరోపిస్తూ వంటిపై పెట్రోల్ పోసుకుని జోగిపేట పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసెందుకు వచ్చాడు. అప్పటికే మద్యం తాగి ఉన్న సలీంను ఉదయం రమ్మని పోలీసులు నచ్చ చెప్పే ప్రయత్నం చేసారు. తన ఫిర్యాదును పోలిసులు నిరాకరించారని ఆగ్రహంతో బాధితుడు అక్కడే నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. అక్కడే ఉన్న స్థానికులు మంటలను ఆర్పి సలీంను మందలించారు. బాధితుడికి తీవ్ర గాయాలు కావడంతో జోగిపేట ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

హవేళిఘణపూర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లింగ్సాన్‌పల్లి తండాలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లింగ్సాన్‌పల్లి తండాకు చెందిన బానోత్ మోహన్ భార్య సోని(42) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. కొన్ని రోజులుగా సోని అనారోగ్యంతో బాధపడుతుంది. దీని వల్ల తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృత దేహాన్ని పోస్టుమార్టు కోసం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరిలించారు. మృతురాలి కొడుకు వినోద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎసై నరేష్ తెలిపారు.

పాముకాటుతో యువకుడు బలి

దౌల్తాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన తిర్మలాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జాలిగామ దయాకర్ (22) తమ పంట పొలంలో పనులు చేసుండగా పాము కాటేయడంతో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పనికి తగిన జీతమివ్వండి సారూ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనకు జేఏసీ కార్యచరణ

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న కాంటినిజెంట్, డైలీవైజ్ వర్కర్స్ నిరవధిక సమ్మె కొనసాగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3700 మంది వర్కర్స్ కొనసాగుతున్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని నెల రోజులుగా ఆందోళన చేపట్టారు. రోజుకో విధంగా వినూత్న రీతిలో నిరసనలు తెలియజేస్తూ ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

బిక్షాటన చేస్తూ, కళ్లకు గంతలు కట్టుకుని, చెవుల్లో పువ్వులు పెట్టుకుని, పచ్చి గడ్డి తింటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పలు పార్టీల నాయకులను, ప్రజాప్రతినిధులను కలిసి మద్దతు కోరుతున్నారు. తమ సమస్య పరిష్కరమయ్యేలా చూడాలని వేడుకుంటున్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి సిద్దిపేటకు వచ్చిన సందర్భంగా ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశరావును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎంపీ రఘునందన్ రావు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. అందరు కూడా సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హమీలిచ్చారు. కాని ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని వర్కర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేస్తున్న వర్కర్స్

ధాన్యం కొనుగోలులో లోటు, పాట్లు లేకుండా చూడాలి

- మెదక్ అదనపు కలెక్టర్ నగేష్‌కు బీజేపీ జిల్లా శాఖ వినతి

మెదక్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి.. కొనుగోలును సకాలంలో ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తూకం వేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించేందు అవసరమయ్యే లారీలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల్లో అక్రమాలకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లో రైతు ఖాతాలో నగదును జమ చేయాలన్నారు.ధాన్యం బస్తాలు, కూలీల కొరత లేకుండా అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మెదక్ అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్





యువకుడి ఆత్మహత్య కేసులో మరో ఇద్దరు అరెస్టు

- క్యూనెట్ కేసులో మొత్తం నలుగురు అరెస్టు

వర్గల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మల్టీలేవల్ మార్కెటింగ్ సంస్థలో పెట్టుబడి పెట్టి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా మంగళవారం మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సంఘటనకు సంబంధించి గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన బడుగు హరికృష్ణ (26) అనే యువకుడు మల్టీ లేవల్ చైన్ సంస్థ మోసానికి అప్పులపాలై ఈ నెల ఈ నెల 9వ తేదిన సూసైడ్ నోటు రాసి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేసి ఈ నెల 13వ తేదీన మణికంఠరెడ్డి, అలేఖ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మంగళవారం మరో ఇద్దరు నిందితులగు హైదరాబాద్ సరూర్ నగర్‌కు చెందిన కంకణాలపల్లి దివ్య, ఖమ్మం జిల్లా కేంద్రం రాపర్తి నగర్‌కు చెందిన అనుమోలు భాను ప్రకాశ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



కొమురవెల్లి గడ్డ.. సీతాఫలాల అడ్డా



కమాన్ వద్ద జోరుగా క్రయవిక్రయాలు

ఇక్కడి నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి



కొమురవెల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా అడవులు, గుట్టల్లో సహజసిద్ధంగా లభించే సీతాఫలాలకు కొమురవెల్లి ప్రసిద్ధి చెందింది. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో తెలంగాణలో ఈ పండ్లు విరివిగా లభిస్తాయి. ప్రస్తుతం కొమురవెల్లి కమాన్ వద్ద జోరుగా క్రయవిక్రయాలు సాగుతున్నాయి. కొమురవెల్లి, కొండపాక, కుకునూర్‌పల్లి, తొగుట, జగదేవ్‌పూర్, గిరాయిపల్లి వంటి ప్రాంతాల అడవులలోని చెట్ల నుంచి సీతాఫలాలను తెంపి, వాటిని ద్విచక్ర వాహనాలపై కొమురవెల్లి కమాన్ వద్దకు తీసుకువచ్చి రాజీవ్ రహదారిపై విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. ఒక్కో ప్లాస్టిక్ ట్రే బాక్స్‌ను రూ.500 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. ఇక్కడికి తీసుకువచ్చిన పండ్లను కొందరు పండ్ల వ్యాపారులు కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఉపాధి కోసం పలువురు విక్రయదారులు ఇక్కడికి సీతాఫలాలను తీసుకువస్తుండటంతో, ఉదయం పూట కొమురవెల్లి కమాన్ వద్ద సీతాఫలాల క్రయవిక్రయాలు జాతరలా జరుగుతున్నాయి.



మురుగు నీటిని తొలగించిన అధికారులు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



చెట్లగౌరారం గ్రామ శివారులో మురుగు కాలువను తీస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనోహరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాల చుట్టూ మురుగు నీరు చేరి విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చుట్టూ చెట్లగౌరారం గ్రామం డ్రైనేజీ నీరు చేరుతోంది. దీంతో పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు ఉన్నాయంటూ మంగళవారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'బడి చుట్టూ మురుగు నీరు' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై మండల సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి స్పందించి రంగాయపల్లి పాఠశాలను పరిశీలించారు. అనంతరం రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడి మురుగు కాలువను జేసీబీతో తవ్వించి, నీటిని తొలగించారు. దీంతో రెండు గ్రామాల మురుగు నీటి సమస్య తీరిపోయింది.

బీబీపేట జంలాతండా న్యాయవాదికి డాక్టరేట్



ఢిల్లీలో డాక్టరేట్ స్వీకరిస్తున్న దేవిదాస్ నాయక్

కల్హేర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించడంలో విశేష కృషి చేస్తున్న డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయవాది దేవిదాస్ నాయక్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. భారత ప్రభుత్వ ఆధీనంలోని ఈ సంస్థ అందించే ఈ డాక్టరేట్‌ను సోమవారం న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ భవన ఆవరణలో అందుకున్నారు. ముఖ్య అతిథులు జార్ఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ కర్పగ వినాయగం, పార్లమెంటు సభ్యుడు ప్రవీణ్ ఖండేల్‌వాల్, అడిషనల్ సెషన్స్ జడ్జి అపర్ణ స్వామిలు డాక్టరేట్‌ను దేవిదాస్ నాయక్‌కు ప్రదానం చేశారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో చీఫ్ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటూ పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు కృషి చేస్తున్న దేవిదాస్ నాయక్‌కు ఢిల్లీలో డాక్టరేట్ దక్కడం విశేషం. మారుమూల గిరిజన తాండాకు చెందిన దేవిదాస్ నాయక్‌కు డాక్టరేట్ దక్కడంపై ఆయన సొంతతండా, కల్హేర్ మండలంలోని బీబీపేట జంలా తాండాకు చెందిన గిరిజనులు, కల్హేర్ మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.

సుల్తానాపూర్ జేఎన్టీయూ ప్రిన్సిపాల్ బదిలీ

● కొత్త ప్రిన్సిపాల్‌గా విశ్వనాథరాజు

పుల్‌కల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తానాపూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ గుగులోత నరసింహ బదిలీ అయ్యారు. కొత్త ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విశ్వనాథరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. సుల్తానాపూర్ జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహను జగిత్యాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. దీంతో పాటు, అదే కళాశాలలో సీఎస్‌ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్వేతను సుల్తానాపూర్ కళాశాల సీఎస్‌ఈ విభాగానికి బదిలీ చేశారు. జూన్ 2022 నుంచి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నరసింహ దాదాపు మూడేళ్ల పాటు ఇక్కడ పనిచేశారు. కళాశాల అభివృద్ధికి ఆయన కృషి చేశారు. కళాశాలలో ఎంటెక్, బీటెక్‌లలో కొత్త కోర్సులు మంజూరు చేయించడంలో విశేషంగా కృషి చేశారు. బీటెక్‌లో ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, ఈఈఈ, సీఎస్‌ఈ అదనపు సెక్షన్, ఎంటెక్ కోర్సులో ఏఐడీఎస్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, వీఎల్ఎస్ఐ, రోబోటిక్స్ ఏఐ కోర్సులు వచ్చేలా పాటుపడ్డారు. వివాదాస్పదంగా మారిన కళాశాల ప్రహరీ గోడ స్థలం కళాశాలకు దక్కేలా చొరవ తీసుకున్నారు. ప్రిన్సిపాల్ నరసింహ ఆకస్మికంగా బదిలీ కావడం పట్ల బోధన, బోధనేతర సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



బదిలీ అయిన జేఎన్టీయూ ప్రిన్సిపాల్ నరసింహ

కారు అద్దాలు పగులగొట్టి రూ. 20 లక్షలు చోరీ



సంగారెడ్డి క్రైం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం సినీఫక్కీలో చోరీ జరిగింది. పట్టపగలు కారు అద్దాలు పగులగొట్టి అందులో నుంచి రూ. 20 లక్షల నగదును అపహరించుకుపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరానికి చెందిన ముజఫర్ సంగారెడ్డిలో భూమి రిజిస్ట్రేషన్ కోసం మంగళవారం రూ.20 లక్షల నగదు తన ఇన్నోవా వాహనంలో తీసుకువచ్చాడు. సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్ వద్ద వాహనం పార్క్ చేసి పక్క దుకాణానికి వెళ్లాడు. అంతలోనే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు కారు అద్దాలను పగులగొట్టి అందులోని రూ.20 లక్షల నగదును అపహరించారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు నిందితులు ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, విషయం తెలుసుకున్న సంగారెడ్డి డీఎస్పీ కె.సత్తయ్యగౌడ్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు జరిపారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ సత్తయ్యగౌడ్ వెల్లడించారు.

పల్లె వనం.. జలదిగ్బంధం

జలదిగ్బంధంలో కంది ప్రకృతి వనం

గ్రామ ప్రజలు సేద తీరేందుకు ఊరూరా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. రూ.లక్షలు ఖర్చుపెట్టి సకల వసతులు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండాపోయింది. కంది గ్రామ పల్లె ప్రకృతి వనం అదే కోవలోకి వస్తున్నది. ఇందులోకి వరద నీరు చేరి నెల రోజులుగా జలదిగ్బంధంలో ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో ఇక్కడున్న తెలంగాణ తల్లి విగ్రహం శిథిలావస్థకు చేరతుండగా, ఆట వస్తువులు తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. ఫలితంగా అధికారుల నిర్లక్ష్యంతో లక్షల్లో ప్రజాధనం వృథా అవుతున్నది.

- నెల రోజులుగా వరదనీటిలోనే..
- కళావిహీనంగా మారిన వైనం
- శిథిలావస్థకు చేరిన తెలంగాణ తల్లి విగ్రహం
- తుప్పుపట్టిన ఆట వస్తువులు
- పట్టించుకోని అధికారులు

కంది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న కంది గ్రామంలోని పల్లె ప్రకృతి వనం అధికారుల నిర్లక్ష్యంతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇటీవల భారీ వర్షాలు కురిసినప్పటి నుంచి పంచాయతీ అధికారులు పల్లె ప్రకృతి వనాన్ని పట్టించుకోకపోవడంతో, అది నెల రోజులుగా వరద నీటిలోనే మగ్గుతోంది. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఈ వనంలో వేలాది పూల, పండ్ల, ఔషధ మొక్కలు నాటారు. చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, వాకింగ్‌కు అనుకూలంగా సీసీ రోడ్లు కూడా ఏర్పాటు చేశారు. ఇందులోనే ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం నీటిలో ఉండి శిథిలావస్థకు చేరుకుంది. అక్కడున్న ఆట వస్తువులన్నీ దుమ్ము, ధూళీ, చెత్తాచెదారంతో నిండి తుప్పుపట్టాయి. రంగురంగుల పూలు, పచ్చని చెట్లతో ఒకప్పుడు ఆహ్లాదకరంగా ఉన్న పల్లె ప్రకృతి వనం ఇప్పుడు కళావిహీనంగా తయారైంది.



నీటితో శిథిలావస్థకు చేరుతున్న తెలంగాణ తల్లి విగ్రహం



కంది పల్లె ప్రకృతి వనంలో నిలిచిన నీరు

అధికారుల నిర్లక్ష్యం... ప్రజాధనం వృథా

పంచాయతీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పల్లె ప్రకృతి వనం మొత్తం బురద, చెట్ల ఆకులతో, చెత్తాచెదారంతో నిండిపోయి కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా దుర్భర స్థితికి చేరుకుంది. గత వర్షాకాలంలో నీరు పోవడానికి వనం ప్రధాన గేటు వద్ద తవ్విన కాలువను ఇప్పటికీ పూడ్చకపోవడం గమనార్హం. కంది గ్రామ పంచాయతీ కార్యాలయంలో దాదాపు 30 మంది సిబ్బంది ఉన్నప్పటికీ, పల్లె ప్రకృతి వనాన్ని శుభ్రం చేయించకపోవడం శోచనీయం. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇన్ని లక్షల రూపాయలు వృథాగా ఖర్చుపెట్టి పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయడం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనం వృథా కాకుండా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీరుగారుతున్న లక్ష్యం

పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లోని ప్రజలందరూ పచ్చటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒక పార్కు లాగా వాకింగ్ చేస్తూ ఆనందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఊరూరా పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ఈ వనాలలో అందమైన పూలు, పండ్లు, వివిధ రకాల ఔషధ మొక్కలు, మెత్తని గడ్డి నాటారు. సందర్శన వేళలు కూడా నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే, అధికారుల ఆలనా పాలన లేకపోవడంతో మొక్కలు ఎండిపోవడం, చెట్ల నుంచి రాలిన ఆకులు, చెత్తాచెదారం శుభ్రం చేయకపోవడంతో పల్లె ప్రకృతి వనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో పల్లె వనాల ఏర్పాటు లక్ష్యం నీరుగారిపోయింది.

అవయవ దానంతో అమరుడయ్యాడు

● ఆరుగురి జీవితాల్లో వెలుగు నింపిన శ్రీకాంత్

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాను చనిపోయి కూడా అవయవదానం చేయడం ద్వారా ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడో యువకుడు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చేవెళ్ల గ్రామానికి చెందిన మదునురోళ్ల శ్రీకాంత్ హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. దసరా పండుగకు తన సొంతూరుకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ నెల 5వ తేదీన సంగారెడ్డి సమీపంలోని ఫసల్‌వాది వద్ద రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లాడు. ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి మంగళవారం మరణించాడు. అయితే తాను చనిపోయినా తన అవయవాలను దానం చేయాలని ముందే తన కుటుంబ సభ్యులకు శ్రీకాంత్ చెప్పడంతో, ఆయన కోరిక మేరకు ఆరుగురికి శ్రీకాంత్ అవయవాలను దానం చేశారు.



ఎం.శ్రీకాంత్ (ఫైల్)

కేసీఆర్ అధికారంలో ఉంటే మల్లన్నసాగర్ రూపురేఖలు మారేవి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

కుకునూరుపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ అధికారంలో ఉంటే మలన్నసాగర్ రూపురేఖలు మరోలా ఉండేవని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మంగోల్ శివార్లో ఉన్న మల్లన్నసాగర్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు ఫైండ్ల రాజశేఖర్ రెడ్డి, గ్యాదరి కిషోర్, మంగోల్ మాజీ సర్పంచ్ కిరణ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు కనకయ్య, అనిల్ ఉన్నారు.



ఖైదీలకు అండగా న్యాయశాఖ

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

● కంది సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ

కంది, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయసేవాధికార సంస్థకు న్యాయవాదులు లేరని అర్జీ పెట్టుకున్న ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఆమె బుధవారం కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జైలులోని అన్ని బ్లాకులను, ఖైదీల బ్యారక్‌లు, గదులు, వంటశాల, బాత్‌రూమ్‌లతో పాటు జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. జైలులో ఖైదీలకు సరఫరా చేసే భోజనం, వారికి కల్పించే సదుపాయాల గురించి జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలకు అందించే ఆహారాన్ని జిల్లా జడ్జి పరిశీలించారు. ఖైదీలకు పెడుతున్న భోజనాన్ని ఆమె రుచి చూశారు. వంటశాలలో ఖైదీల కోసం వండే కూరగాయలు, బియ్యం, పప్పుదినుసులను తనిఖీ చేశారు. ఖైదీలకు అందించే రోజువారీ ఆహారంలో నాణ్యతలో లోపం ఉండకూడదని జైలు అధికారులకు సూచించారు. అనంతరం ఖైదీలతో ఆమె మాట్లాడుతూ.. సమయానికి బెయిల్స్ ములాఖత్‌లు అందుతున్నాయా అని ఆరా తీశారు. కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు న్యాయవాదులు లేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఖైదీలు ఉచిత న్యాయ సేవలు పొందేందుకు వారి తరఫున న్యాయవాదులను నియమిస్తామన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారులు, కోర్టు సిబ్బంది, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో ఇసుక దొంగలు

పుల్‌కల్ మండలంలో జోరుగా అక్రమ రవాణా

- ట్రాక్టర్ ఇసుకకు రూ.8 వేల వరకు వసూలు
- అటవీ సిబ్బందికి ఒక్కో ట్రాక్టర్‌పై రూ.2 వేలు ముడుపులు!
- భారీ వర్షాలకు అడవిలో ఏర్పడిన ఇసుక మేటలే లక్ష్యం
- భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం





అటవీ నుంచి ఇసుకను తరలింపు, బొమ్మారెడ్డిగూడెం తండా సమీపంలో అడవిలోకి వెళ్లేందుకు బాట

పుల్‌కల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పుల్‌కల్ మండలంలో విస్తరించి ఉన్న రిజర్వు ఫారెస్టులో అక్రమ ఇసుక దందా జోరుగా సాగుతోంది. అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న పలు గ్రామాల ప్రజలు ధనార్జనే ధ్యేయంగా ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.6 వేల నుంచి రూ.8 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ముదిమాణిక్యం, మినపూర్, కోడూరు, గొంగ్లూరు, ఉప్పరిగూడెం, బొమ్మారెడ్డిగూడెం, లక్ష్మీసాగర్ గ్రామాల శివారు భూముల్లో దాదాపు మూడు వేల ఎకరాల్లో రిజర్వు ఫారెస్టు విస్తరించి ఉంది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు అడవిలో పెద్ద ఎత్తున ఇసుక మేటలు ఏర్పడ్డాయి. చౌటకూర్, మినపూర్ బీట్ పరిధిలోకి వచ్చే ఈ అటవీ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకుని అక్రమార్కులు ఇసుకను దోచుకుపోతున్నారు.

కందకాలు తవ్వుతున్నాం..

ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా అడవి మధ్యలో కాలువలు తవ్వుతున్నాం. ఇప్పటికే అటవీ ప్రాంతం చుట్టూ కందకాలు తవ్వాం. అక్రమంగా ఏర్పాటు చేసిన మట్టి బాటలను మూసివేయడం, ఉదయం వేళల్లో గస్తీ తిరుగుతూ ఇసుక తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. పట్టుబడిన ట్రాక్టర్ యజమానులకు జరిమానా విధించాం . అనుమతి లేకుండా అడవిలోకి వెళ్లకూడదు.

– డిప్యూటీ రేంజి ఆఫీసర్ వేణుగోపాల్

ముడుపులకు అలవాటు పడిన అధికారులు!

ఇతర ప్రాంతాల నుంచి నాణ్యమైన ఇసుక ధర వేలల్లో పలుకుతున్న తరుణంలో, అడవిలో వరద ప్రవాహంతో సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక దిబ్బలను అక్రమార్కులు కాజేస్తున్నారు. ఇసుక వ్యాపారం అడ్డు అదుపు లేకుండా సాగుతున్నా, సంబంధిత అటవీ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేస్తుంటే, అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటున్న అటవీ సిబ్బంది ఒక్కో ఇసుక ట్రాక్టర్‌కు రూ.2 వేలు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.అటవీ అధికారులే తమ జేబుల్లో ఉన్నారన్న ధైర్యంతో అక్రమార్కులు రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. అడవి నుంచి ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అటవీ శాఖ అధికారులు స్పందించి అక్రమ ఇసుక వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మద్దూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపారు. మండలంలోని అర్జున్‌పట్ల గ్రామ బ్రిడ్జి వద్ద గల వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన కొలుపుల పరశురాములు, బురుగు రాజశేఖర్‌లు ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● చేర్యాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం అర్జునపట్ల, ఆకునూరు, తాడూరు గ్రామాలనుండి సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సెట్విన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులను చేర్యాల ప్రాంత యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రణీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్ విభాగంలో మూడునెలలపాటు మధ్యాహ్నం 2నుండి 4.30గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

హమాలీ సంఘం మండల కమిటీ ఎన్నిక

చేర్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ హమాలీ కార్మికసంఘం చేర్యాల మండల కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం చేర్యాలలో జరిగింది. అధ్యక్షుడుగా ఎలుగు రవీందర్, మండల కార్యదర్శిగా దప్పు కిషన్, ఉపాధ్యక్షులుగా శ్రీరాముల మహిపాల్, పిట్టల యాదగిరి, గుజ్జుల క్రిష్టారెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఆవుల కృష్ణమూర్తి, గర్నెపల్లి నర్సింహులు, ఎంటె నర్సయ్య, భైర లింగం, సభ్యులుగా సింగపాక బాలయ్య, బాగోతం లింగం, ఏదుల చందు, చెరువు సాయిలు, నూకల శ్రీనివాస్, మేడిచెల్మె పరశురాములు, ఒగ్గు రాములు ఎన్నికయ్యారు.

అసమానతల నిర్మూలనకు బౌద్ధమతమే ఏకైక మార్గం

గజ్వేల్ రూరల్ 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక అసమానతలను నిర్మూలించడానికి బౌద్ధమతమే ఏకైక మార్గం అని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో కొమటిబండ బుద్ధుని విగ్రహం వద్ద మంగళవారం డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణుతో కలిసి డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ధమ్మ చక్ర పరివర్తన దివాస్‌ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ సామాజిక దురాచారాలను నిర్మూలించడానికి బౌద్ధ మతం ఏకైక పరిష్కారమని, బుద్ధుని సందేశం ప్రపంచవ్యాప్తంగా శాంతి ప్రశాంతతను నిర్ధారిస్తుందన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి

గజ్వేల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మొక్కజొన్న పంటను కొనుగోలు చేసే కేంద్రాలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల పంటలను కొనుగోలు చేయాలన్నారు. పంటను కోసి పదిహేను రోజులు దాటుతున్నా కొనుగోలు కేంద్రాల జాడ లేదన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర అందించి కొనుగోలు చేయాలని లేనిపక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. వారివెంట మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, నాయకులు ఉమర్, శివకుమార్, నిజామొద్దీన్ తదితరులున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేక నష్టపోతున్న రైతులు

హుస్నాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అలాగే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు.

ఆధార్ కేంద్రం లేక అవస్థలు

- ఏ చిన్న మార్పు కోసమైనా జిల్లా కేంద్రం లేదా ఇతర ప్రాంతాలకు పరుగులు పెట్టాల్సిందే
- నిర్వాహకుల తప్పిదాలతో చిన్నకోడూరులో మూతపడిన ఆధార్ కేంద్రం
- మండల ప్రజలకు తప్పని ఇక్కట్లు

చిన్నకోడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఆధార్ కేంద్రం లేక పోవడడంతో చిన్నకోడూరు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డు తీసుకునేందుకు, పాత ఆధార్ కార్డులో మార్పుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

గత నిర్వాహకుల తప్పిదాలతో సేవలకు దూరం

మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు గతంలో చిన్నకోడూరు మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రం నుంచి సేవలు పొందేవారు. గతంలో ఉన్న ఆధార్ కేంద్రం నిర్వాహకుల తప్పిదాల వల్ల సంబంధిత అధికారులు లాగిన్ ఐడీని బ్లాక్ చేశారు. అప్పటి నుంచి ఆధార్ కేంద్రం అందుబాటులో లేక మండల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది.

దూరాభారంతో ప్రజలకు ఇక్కట్లు

ఆధార్ కేంద్రం మూత పడటంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు, ఇతర మండలాలకు పరుగులు పెడుతున్నారు. ఆధార్ కార్డులో ఏ చిన్న మార్పు చేయాలన్నా వ్యయప్రయాసలకోర్చుకోని ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడానికి సమయం సరిపోక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ సేవలకు ఇతర ప్రాంతాలకు వెళితే అక్కడ డబ్బులు సైతం ఎక్కువగా వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని సార్లు అక్కడి వెళ్లాక సైట్ రాకపోతే వెళ్లిన పని కాకుండానే వెనుతిరిగి రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్థానికంగా ఆధార్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధార్ సెంటర్‌ను అందుబాటులోకి తేవాలి



మండలంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు సిద్దిపేట, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. అక్కడికి వెళ్లాక పని కాకపోతే రెండు, మూడు సార్లు తిరగాల్సిన పరిస్థితి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికంగా ఆధార్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

-బాబు, యువకుడు, చిన్నకోడూరు

కొత్తగా ప్రతిపాదనలు పంపించాం

గతంలో ఉన్న ఆధార్ కేంద్రం నిర్వాహకుల తప్పిదాలతో యూఐడీ నుంచి లాగిన్ ఐడీని బ్లాక్ చేశారు. వారిని యాక్టివేట్ చేసుకోమంటే చేసుకోలేదు. కొత్తగా మళ్లీ ప్రతిపాదనలు పంపించాం. కొంత సమయం పడుతుంది.

-ఆనంద్ కుమార్, మీసేవా ఈ- జిల్లా మేనేజర్

సైబర్‌నేరాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ దుర్గా, రూరల్ ఎస్ఐ కె.రాజేష్‌లు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి); మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గా, సిద్దిపేట రూరల్ ఎస్ఐ కె.రాజేష్ తెలిపారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మహిళల చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ దుర్గా మాట్లాడుతూ అపరిచితుల ఫోన్ కాల్స్ నమ్మవద్దని సూచించారు. గంజాయి డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, షీ టీం బృందం ఏఎస్ఐ కిషన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై...

గజ్వేల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై ఫైర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా కేటగిరిలపై అవగాహన కల్పించిన ఆయన అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన పద్ధతులను డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారుల

క్రీడలో ఎంజేపీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ


అండర్ 19 క్రీడల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు

దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగరాజుపల్లి వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉమ్మడి మెదక్ జిల్లా, సంగారెడ్డి పట్టణాల్లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ అండర్-19, అండర్-14 విభాగంలో విద్యార్థులు, 11 మెడల్స్‌ను సాధించారు. అండర్ -14 విభాగంలో విష్ణువర్ధన్, దేవీదాస్, భానుప్రసాద్, గణేష్, గిరీష్ అలాగే అండర్ 19 విభాగంలో భరత్, జశ్వంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి కృష్ణ, బస్వరాజ్, డాంబు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


సమీరా, దివాకర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

హుస్నాబాద్/మద్దూరు, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి నూనె దివాకర్ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వాసుదేవరెడ్డి తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని నవభారత్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని భూక్య శాన్వి సైతం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గంగరవేని రవి తెలిపారు. అలాగే ధూళిమిట్ట మండలకేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌కు చెందిన విద్యార్థిని సుమేరా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అనుముల కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు పటాన్‌చెరులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు.

యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దు


మీర్జాపూర్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మారెడ్డి

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు పిల్లలపట్ల శ్రద్ధ వహించాలని హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండలంలోని మీర్జాపూర్‌లో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా కట్టడి చేయాలని కోరారు. మూఢనమ్మకాలను వీడాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. పోలీస్ కళాబృందం సభ్యులు పలు అంశాలపై పాటలు, నృత్యాలరూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలు, రాజు తిరుమల, స్నేహ, అరుణ, శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి


స్కూలులో సభ్యత్వ నమోదు చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు జి.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, సీతారాంపల్లి, చింతమడక, మాచాపూర్, రావురూకుల, పుల్లూరుతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు 2023 నుంచి రావాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ అజీజ్, మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాందాస్, నాయకులు శ్రీశైలం, గౌతమి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజసేవలో ముందుండాలి



వర్గల్‌లోని ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో విద్యార్థులు

వర్గల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ దేశబోయిని నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం వర్గల్ మండల కేంద్రంలో హైదరాబాద్ బాగ్ లింగంపల్లి అంబేద్కర్ డిగ్రీ కళాశాల వారు నిర్వహిస్తున్న జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సమాజసేవ ఎంతో ముఖ్యమన్నారు. మార్కుల సాధనే జీవిత లక్ష్యం కాకూడదని సామాజిక స్పృహ విద్యలో భాగమేనన్నారు. సమాజ సేవలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు జట్టు, కృషి , నాయకత్వం వంటి జీవన నైపుణ్యాలను తెలుసుకుంటారన్నారు. బాలల హక్కుల గురించి తెలియజేస్తూ విద్యార్థులు, యువత చెడు వ్యాసనాలకు లోను కాకుండా మంచి మార్గంలో నడవాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ క్యాంపు విద్యార్థులు గ్రామంలోని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అఫీసర్ స్వప్న, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాండు, వలంటీర్స్ పాల్గొన్నారు.

టీచర్లకు పర్యవేక్షణ బాధ్యతలు సరికాదు

మద్దూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న ఆలోచన మేరకు ఉపాధ్యాయులతో పర్యవేక్షణా కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తగదని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకి చంద్రబాను అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు పర్యవేక్షణ పేరిట దూరంగా ఉంటే విద్యార్థులకు విద్య ఎలా దక్కుతుందని ప్రశ్నించారు. పదో తరగతి వార్షిక పరీక్షల సమయం దగ్గరపడుతున్న క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 1474మంది ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం తగదన్నారు. వెంటనే ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఏకీకృత సర్వీస్‌రూల్స్ రూపొందించి ఖాళీగా ఉన్న డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు.

పప్పు ధాన్యాలు పండించాలి: ఏడీఏ

జగదేవ్‌పూర్: అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) పప్పు దినుసులు పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని ములుగు డివిజన్ వ్యవసాయ అధికారి అనిల్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత, పోషన్ మిషన్ పథకం కింద రైతులకు రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి, పత్తి పంటలకే పరిమితం కాకుండా పప్పుదినుసులపై మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెరుకు లక్ష్మారెడ్డి, ఏవో వసంతరావు, ఏఈవోలు భాను, కిరణ్, ఖలీల్, ప్రసన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో ఆటో కార్మికుల బతుకులు దుర్భరం


సిద్దిపేటలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు బకాయి పడిన బాకీ కార్డు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాల సాయిరాం

సిద్దిపేట అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆటో కార్మికుల బతుకులు దుర్భరమైపోయాయని సిద్దిపేట ఆటో క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పాల సాయిరాం పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో సిద్దిపేట ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో అన్నలకు బాకీ కార్డు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు పాలసాయిరాం మాట్లాడుతూ ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం ఆలోచించకుండా మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఆటో కార్మికుల ఆత్మహత్యలన్నీ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇస్తామన్న రూ. 12 వేలు ఇప్పటివరకు చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. ఇప్పటికైనా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసి కార్మికులకు ఇస్తామన్న జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆటోలకు కాంగ్రెస్ బాకీ కార్డు స్టిక్కర్లు వేసుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలి

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు పత్తి రైతులను మోసం చేస్తే సహించేది లేదని, ప్రభుత్వం వెంటనే హుస్నాబాద్‌లో సీసీఐ ద్వారా పత్తికొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పందిల్ల బాలాజీ కాటన్ మిల్‌లో పత్తిని విక్రయిస్తున్న రైతులతో మాట్లాడారు. అష్టకష్టాలు పడి పత్తిని పండిస్తే వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 8,100 ఉంటే వ్యాపారులు మాత్రం రూ.4500 నుంచి 5,500 మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు చెప్పారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర అందించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి, మేకల వికాస్ యాదవ్ ఉన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించేందుకే డ్రైడే

మద్దూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకే డ్రైడే కార్యక్రమాన్ని క్రమం తప్పక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్. రాం మోహన్ తెలిపారు. మంగళవారం మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలలోని పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడారు. పాఠశాల పరిసరాల చుట్టూ దోమలకు ఆవాసాలుగా ఉన్న గడ్డిని తొలగించడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వరదరాజులు, ఎంపీవో వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తుల్లో వేగం పెంచాలి: కలెక్టర్


జూమ్ ద్వారా భూ భారతి దరఖాస్తుల ప్రక్రియపై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూ భారతి పెండింగ్ దరఖాస్తుల్లో వేగం పెంచాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ గూర్చి ఆర్డీవో, తహసీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులతో కలెక్టర్ హైమావతి జూమ్ యాప్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుల ప్రక్రియలో మిస్సింగ్ సర్వే నంబర్, పెండింగ్ మ్యుటేషన్ సక్సేషన్, డీఎస్, ఫీల్డ్ ఎంక్వైరీ, చేంజ్ ఆఫ్ నేమ్, నేచర్, నేషన్ ఖాతా, పీవోబీ, సాదా బైనామా ఇతరత్రా దరఖాస్తులు తహసీల్దార్, ఆర్డీవో, ఏసీ రెవెన్యూ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూసుకోవాలని, భూ భారతి చట్టంలోని మార్గదర్శకాల ప్రకారమే దరఖాస్తుల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి


కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రమిస్తున్న వర్కర్స్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్, కాంటింజెంట్ వర్కర్ల నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. సెప్టెంబరు 12న మొదలైన సమ్మె మంగళవారం 33వ రోజు కూడా కొనసాగింది. తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయంలో డైలీ వేజ్ గిరిజన సంఘం జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డైలీవేజ్ గిరిజన సంఘం సిద్దిపేట జిల్లా నాయకులు గంగా, శ్రీను, కిషన్, రమేష్, శారద, సురేష్, రమేష్, లక్ష్మీస్వామి, ఈరమ్మ, కనకయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యానికి మేలు



పోషణ మాసంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖ తదితరులు

దౌల్తాబాద్,అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): పోషకాహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని దుబ్బాక ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ 3వ సెంటర్ ఆధ్వర్యంలో పోషణ మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ హెల్త్ సూపర్‌వైజర్ అమరావతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, జిల్లా బాలల పరిరక్షణ భాగం కౌన్సిలర్ నరసింహులు, ఆశా కార్యకర్త బాలమణి అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తాం


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మద్దూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ జెండాను ఎగురవేస్తామని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొంగోని సురేష్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ పంక్షన్‌హాల్‌లో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మోకు ఉదయ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి కమిటీలను బలోపేతం చేస్తూ మండలంలో పార్టీ జెండాను ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కూరెల్ల రాజు, సీనియర్ నాయకులు రాపాక బుచ్చిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు బియ్య రమేష్, బొంగోని బాలు, కూరెల్ల కిరణ్, సోగాల మనోజ్, గుండెగోని రాజు, చింతల రాజు, కొండల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పీడీ రఫత్‌ను పరామర్శించిన జనగామ డీసీసీ అధ్యక్షుడు

చేర్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల చికిత్సపొందిన చేర్యాల పట్టణానికి చెందిన పీడీ, ఎస్‌జీఎఫ్ ప్రతినిధి ఎండీ రఫత్ ఓమర్‌ను జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయన స్వగృహానికి వెళ్లి రఫత్‌ను పరామర్శించి బాగోగులు అడిగితెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొమ్మూరి వెంట కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు బండెల మహి పాల్‌రెడ్డి, నాయకులు నీలం సన్నీ, రాగుల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

స్టీల్‌బ్యాంకులో సామగ్రి స్వాహా..!

(5వ పేజీ తరువాయి)

తీసుకెళ్లిన స్టీల్ వస్తువులు మాయమైనట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీంతో, అప్పుడు కొందరు సిబ్బంది చూపించిన చేతివాటం వల్లే ఇదంతా జరిగిందా? లేక వీటిని ఎవరైనా స్టీల్ బ్యాంకుల నుంచే హోటల్ నిర్వహకులకు అమ్మివేశారా? అనే సందేహం కలుగుతోంది.

నిబంధనలు తుంగలోకి..

స్టీల్ బ్యాంకుల నిర్వహణ బాధ్యతలను మెప్మాలోని ఆర్పీలకు అప్పగించారు. వార్డుల్లో ఎవరైనా శుభకార్యాలకు సామాగ్రి తీసుకెళ్తే, వస్తువులను బట్టి 24 గంటలకు అంటే ఒక్క రోజుకు అద్దె వసూలు చేస్తున్నారు. ఎన్ని రోజులు కావాలో చెబితే దానిని బట్టి వెయ్యి రూపాయల మేర అడ్వాన్స్ నిర్ణయించారు. తీసుకెళ్లిన సామాగ్రిని 24 గంటల్లోగా శుభ్రంగా కడిగి తిరిగి అప్పగించాలని ఆర్డర్ తీసుకున్నప్పుడే నిర్వహకులు స్పష్టం చేస్తున్నారు. కానీ, కొన్ని నెలలు గడుస్తున్నా వ్యాపారుల వద్దే స్టీల్ బ్యాంకు సామాగ్రి ఉంటుంటే ఆర్పీలు ఏం చేస్తున్నారని పలువురు వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్టీల్ బ్యాంక్ నుంచి స్టీల్ ప్లేట్లను ఎత్తుకెళ్లిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిద్దిపేట వార్డు ప్రజలు కోరుతున్నారు. ఒక్కో వార్డులో గతంలో 750 మందికి సరిపడా సామాగ్రి అందుబాటులో ఉండేదని, ఇప్పుడు ఆ సంఖ్య చాలా తక్కువైందని పలువురు కాలనీ వాసులు చెబుతున్నారు. అసలు స్టీల్ బ్యాంకుల్లో ఉన్నదేంత... పోయినదేంత అనే లెక్క తేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


ఓ వార్డుకు చెందిన స్టీల్ బ్యాంకు